క్లుప్తంగా

సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న విద్యుత్ అధికారులు

రుద్రవరం: తిప్పారెడ్డిపల్లె మెట్ట వద్ద దాదాపు రూ.3.5 కోట్లతో శుక్రవారం నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకు నంద్యాల డీఈఈ రమణారెడ్డి, కన్‌స్ట్రక్షన్ డీఈ రాజేష్, ఆళ్లగడ్డ డీఈఈ రవికాంత్ చౌదరి, రుద్రవరం ఏఈ రాఘవేంద్రారెడ్డి, విద్యుత్ భూమి పూజ చేశారు. డీఈఈ మాట్లాడుతూ తిప్పారెడ్డిపల్లె మెట్ట వద్ద సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.అలాగే అటు ఆలమూరు,ఇటు రుద్రవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లకు ఓవర్ లోడ్ సమస్య తగ్గుతుందని చెప్పారు.

విద్యుత్ సామగ్రి చోరీ

రుద్రవరం: పాత సామగ్రి, పనికి రాని వస్తువుల పేరుతో విద్యుత్ సామగ్రి చోరీకి గురవుతుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. అయితే కొందరు రైతులు మాటు వేసి చోరీకి పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించిన ఘటన శుక్రవారం మండలంలోని మందలూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతులు పొలాల్లోని వ్యవసాయ బోరు మోటార్లు, ట్రాన్స్ ఫార్మర్ వంటి వాటికి సంబంధించిన విద్యుత్ సామగ్రిని ఇళ్లకు కొద్ది దూరంలో ఉన్న కళ్లాల్లో భద్రపరుచుకుంటున్నారు. అలా దాచుకున్న వాటిని ఆళ్లగడ్డ ప్రాంతం నుంచి కొందరు మహిళలు, చిన్నారులు పాత సామన్ల పేరుతో విద్యుత్ సామగ్రిని చోరీ చేసి సంచుల్లో తీసుకెళ్తుండగా రైతులు గుర్తించి వారిని పట్టుకొని రుద్రవరం పోలీసులను పిలిపించి అప్పగించారు. కొంత కాలంగా గ్రామంలో ఇదే తంతు సాగుతోందని చోరీలు పునరావృతం కాకుండా చూడాలని రైతులు కోరారు.

కుంటకు నీరు విడుదల


గోవిందపల్లె కుంటకు చేరిన నీరు

శిరివెళ్ల: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు గోవిందపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు చొరవ చూపారు. దాదాపు 8 వేల జనాభా ఉన్న గ్రామంలో నీటి కుంట ఉంది. అది ఎండిపోవడంతో గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. అప్రమత్తమైనన వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు కేసీ కెనాల్ సబ్ చానల్ ద్వారా నీటిని విడుదల చేయించారు. కాల్వ నీటిని రైతులు వాడుకోకుండా పోలీసుల పహారా ఏర్పాటు చేయించారు. మరో రెండు రోజులు నీటి విడుదల కొనసాగితే కుంట నిండుతుంది. నిండిన కుంట ద్వారా రెండు నెలల పాటు నీటి సమస్య తగ్గుతుందని, అలాగే భూగర్భ జలాలు రీచార్జ్ అయ్యి చేతి పంపులు, బోర్లలో నీటి ఊట పెరుగుతుందని, ప్రజలకు అవస్థలు ఉండవని వారు పేర్కొంటున్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి


పైపులైన్‌ను ప్రారంభిస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ: దేవాలయాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. రామతీర్థ పుట్టాలమ్మ క్షేత్రంలో రూ.3 కోట్లతో చేపట్టిన పైపులైన్, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే భక్తులకు నీటి సమస్య ఉండదన్నారు. క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, ఈఓ జయచంద్రారెడ్డి ఉన్నారు.

మహానందిలో నేడు ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మహానంది: మహానందిలో శనివారం అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పోటీలను ప్రారంభిస్తారన్నారు. సీనియర్స్, సబ్ జూనియర్స్, న్యూ కేటగిరీ విభాగాల్లో రాష్ట్రస్థాయి వృషభ బలప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం పలువురు ప్రముఖులు మహానందీశ్వరుడి సన్నిధిలో పూజలు నిర్వహించారు. కర్నూలుకు చెందిన న్యాయమూర్తులు రాంభూపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేపట్టారు. వారితో పాటు నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

హరహర మహాదేవ శంభోశంకర

- శివనామ స్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు
- వైభవంగా మహాశివరాత్రి
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు




స్పటిక లింగేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు , రుద్రవరంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం, మాయలూరులో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా హరహర మహాదేవ శంభోశంకర అనే నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. పరమేశ్వరుడికి అభిషేకాలు, రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు. పట్టణంలోని పలు శైవ దేవాలయాలను దర్శించుకోవడానికి భక్తులు బారులుదీరారు.

☛ ప్రథమనంది క్షేత్రంలో తెల్లవారుజాము నుండే అభిషేకాలను ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. కేదారేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి లింగోద్భవ కాలం అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం జరిపించారు.

☛ సోమనంది క్షేత్రంలో సోమనంది,సోమేశ్వరదేవికి భక్తులు అభిషేకాలు, పూజలను నిర్వహించారు. బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నాగనంది స్వామికి జలాభిషేకం చేసి పుష్పాలంకరణ గావించారు

☛ చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న శ్రీభీమేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు చేశారు. బ్రహ్మనందీశ్వర స్వామి ఆలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర స్వామి ఆలయం, మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాలలో నగరేశ్వరస్వామికి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఒట్టివేర్ల నీళ్లతో అభిషేకం చేశారు.

☛ సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వేర స్వామికి అభిషేక పూజలను నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. రాత్రి 108 కలశాలతో అభిషేకం చేశారు. లింగోద్భవ అనంతరం కాశీవిశ్వనాథుడు, కాశీ విశాలాక్షి అమ్మవారికి కల్యాణం నిర్వహించారు.

☛ నాలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి రాత్రి వివిధ పండ్ల రసాలతో అభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిపించారు.

☛ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో పంచామృతాభిషేకాలు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, రాత్రి స్వామి అమ్మవార్ల కల్యాణం చేపట్టారు.

☛ గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో రాత్రి కల్యాణం నిర్వహించారు.

☛ యోగా చైతన్య కేంద్రంలో శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు.

☛ స్పటిక లింగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

☛ రుద్రవరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాలు, నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఉల్లెడ మల్లేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో వెలసిన శివ లింగాలు,శివ పార్వతుల విగ్రహాలను అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు.

☛ ఉయ్యాలవాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలో వివిధ గ్రామాల్లో భక్తులు శివాలయాలకు చేరుకుని శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. మాయలూరు గ్రామంలో శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితులు రవికుమార్‌శర్మ, లోకేష్ శాస్త్రోకంగా జరిపించారు.సాయంత్రం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.


సంజీవనగర్‌రామాలయంలో కాశీవిశ్వనాథుడికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం


యోగా చైతన్య కేంద్రంలో సామూహిక రుద్రాభిషేకాలు


భీమలింగేశ్వర ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


బ్రహ్మనందీశ్వర ఆలయంలో డ్రైఫ్రూట్స్‌తో అభిషేకం చేసిన భక్తులు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వ చేయూత


రైల్వే డీఎంఓ జ్యోత్స్నను సత్కరిస్తున్న సత్యవాణి


సీనియర్ శాస్త్రవేత్త వెంకటరమణమ్మను సన్మానిస్తున్న ఏడీఆర్ వెంకటేశ్వర్లు

ఉయ్యాలవాడ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మహిళా అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ స్త్రీలకు ఆర్థికంగా భరోసా కల్పించారని మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు మహేశ్వరరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం పొదుపు గ్రూపు నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేందుకు అవగాహన కల్పించిన వీఓఏలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. సీసీ గంగన్న, నాగన్న పాల్గొన్నారు.

నంద్యాల(సిటీ): మహిళల అభ్యున్నతే అసలైన అభివృద్ధి అని సమాజ్‌వాదీ పార్టీ రాయలసీమ కో ఆర్డినేటర్ పాండురంగ యాదవ్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల చైతన్యంతో సమాజంలో అసలైన మార్పు వస్తుందన్నారు. పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ యాదవ్, కార్యదర్శి నక్కరాజేష్, హనుమంతుకుమార్ నాయుడు, స్నేహ, అరుణ పాల్గొన్నారు.

నంద్యాల(వ్యవసాయం): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గుంటూరు డివిజన్ నంద్యాల బ్రాంచ్ సెక్రటరీ రంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక కార్యాలయంలో డీఎంఓ జ్యోత్స్న ప్రియదర్శిని, ఏజీఎస్ సత్యవాణిని ఘనంగా సత్కరించారు. నాగమణి, షకీలా, అన్వర్‌బాషా, చంద్రశేఖర ఆచారి పాల్గొన్నారు.

☛ వాసవీ క్లబ్ వనిత నంద్యాల ప్రగతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు గౌరవాధ్యక్షురాలు యాడికి శ్రీదేవి, అధ్యక్షురాలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. నంద్యాల సీనియర్ జర్నలిస్టు నాగమణిని సత్కరించారు.

☛ బీజేపీ కార్యాలయంలో అభిరుచి మధు ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు బత్తిన స్వాతి, పద్మప్రియ, జక్కా రాజేశ్వరి, వాణి, మధుర, వహిదా, హసీనాను సత్కరించారు.

నంద్యాల(సెంట్రల్): ఎందరో మహనీయుల పోరాట ఫలితంగా దేశంలో స్త్రీ,పురుష సమానత్వం ఇప్పుడిప్పుడే సాకారం అవుతోందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు (ఏడీఆర్) ఎన్.సీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పరిశోధన స్థానంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంట తెగుళ్ల నివారణలో చేసిన కృషి, వ్యవసాయ విస్తరణలో ప్రభావవంతమైన సేవలకు గాను సీనియర్ శాస్త్రవేత్త డా.వెంకటరమణమ్మను సన్మానించారు. శాస్త్రవేత్తలు సతీష్ బాబు, రమాదేవి, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

అత్యున్నత స్థానం లక్ష్యం కావాలి

ఆళ్లగడ్డ: విద్యార్థినులు చిన్నప్పటి నుంచే అత్యున్నత స్థానాన్ని లక్ష్యంగా ఎంచుకుని ముందుకు సాగాలని ఆళ్లగడ్డ పట్టణ ఎస్‌ఐ నగీనా సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవగా వారు ఆమెను ఘనంగా సన్మానించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల(అర్బన్): పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ చైర్‌పర్సన్ శిల్పా నాగినిరెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ శివారులోని పరివర్తన లైఫ్ సెంటర్‌లో శుక్రవారం కేక్ కట్ చేశారు. రూరల్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ అనిరేచల్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు గన్ని, షేక్షా పాల్గొన్నారు.

శిరివెళ్ల: మహిళాభివృద్ధే దేశాభివృద్ధి అని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. అనంతరం మహిళా అధ్యాపకులకు బహుమతులు అందజేశారు.


ఎస్‌ఐ, ప్రిన్సిపాల్‌ను సన్మానించిన దృశ్యం


చిన్నారులకు కేక్ తినిపిస్తున్న నాగినిరెడ్డి

నంద్యాల అభివృద్ధే లక్ష్యం


పద్మావతి నగర్ రోడ్డు, డ్రైన్లను ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల(సిటీ): పట్టణ అభివృద్ధే తమ లక్ష్యమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతినగర్‌లో రూ.3.67 కోట్లతో నిర్మించిన ప్రధాన రహదారి, డ్రైన్లను ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ నంద్యాల ప్రజలకు అత్యున్నత సౌకర్యాలను కల్పించేందుకు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యమైన రోడ్లు వేసి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదన్నారు. నంద్యాలలో సంక్షేమం, అభివృద్ధి రెండు జోడెడ్లలాగా పరిగెడుతుంటే పచ్చ పార్టీలకు మాత్రమే కనిపించడం లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో అన్ని కులాలు, మతాలను రాజకీయాలకు అతీతంగా చూస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనేన్నారు. శిలాఫలకంపై పేర్లు ఎవరికైనా ఇబ్బందిని కలిగిస్తే తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. ఇక్కడ పలు వార్డులు,రోడ్లు కలసిన సర్కిల్ కాబట్టి అలాంటి పైలాన్ వేసినట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారని, ఎవరి మనోభావాలను దెబ్బతీయడం తమకు ఇష్టం లేదన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, డైరెక్టర్లు చంద్రశేఖర్, సునీతఅమృత రాజ్, నాయకులు రామలింగారెడ్డి, దేశం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కిందపడి వలంటీర్ మృతి

రుద్రవరం: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రామయ్య (31)అనే వలంటీర్ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం విధుల్లో భాగంగా గ్రామంలో తిరుగుతూ ప్రమాదవశాత్తు కిందపడి అక్కడి క క్కడే మృతి చెందాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందని, మృతుడి తండ్రి నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు.

వైఎస్సార్‌సీపీతోనే పల్లెల్లో ప్రగతి



భాగ్యనగరంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

దొర్నిపాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలో రూ.2.68 కోట్లతో నిర్మించిన అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. రూ.96 లక్షలతో దొర్నిపాడు నుంచి అర్జునాపురం రోడ్డు, రూ.21.80 లక్షలతో బుర్రారెడ్డిపల్లెలో ఆర్‌బీకే, భాగ్యనగరంలో రూ.10లక్షలతో డ్రైనేజీ, రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అలాగే అమ్మిరెడ్డి నగరంలో రూ.10లక్షలు, అర్జునా పురంలో రూ.5లక్షలు, దొర్నిపాడులో రూ.39లక్ష లు, చాకరాజువేముల గ్రామంలో రూ.33లక్షలు, గుండుపాపలలో రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. కొండాపురంలో రూ.21.80లక్షలతో నిర్మించిన హెల్త్‌సెంటర్, సొసైటీ రుణాలతో నిర్మించిన కార్యలయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. రానున్న ఎన్నికల్లో మరో సారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధిని సాధిద్దామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్లు భూమా చెంచిరెడ్డి, డీలర్ శివుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ శివారెడ్డి, వైస్ ప్రెసిడెంట్స్ కాకర్ల మోహన్‌నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జాకీర్‌బాషా, లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాదం శీను, వెంకటసుబ్బానాయుడు, వాసుడు, మైనుద్దీన్, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ షాజహాన్, సర్పంచులు మాధవీలత, మాధవీ, ఉమాదేవి, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, శంకర్‌రెడ్డి, బాలసుబ్బయ్య, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి సునీత, పీఆర్‌డీఈ లక్ష్మినరసింహ, ఏఈ కొండారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం


50 పడకల వైద్యశాల భవనానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: ప్రజలకు అత్యంత ఆధునిక, నాణ్యమైన వైద్య సేవలందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సుజాత అధ్యక్షతన 50 పడకల వైద్యశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ పాలనలో వైద్యరంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో టీడీపీ నాకులు పూనకం వచ్చినట్లు ఏవేవో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. అయితే గెలిచినప్పటి నుంచి నిత్యం ప్రజల్లోనే ఉంటున్నామని, కేవలం ఎన్నికల కోసం తాము బయలుదేరలేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నామని, తమ హయాంలో జరిగిన అభివృద్ధి ఇప్పటి వరకు జరగలేదంటే వారు ఏస్థాయిలో పనులు చేశారో తెలుస్తుందన్నారు. వారు చేసిన పని ఒక్కటైనా ఉందో చూపాలని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో తిరిగితే అభివృద్ధి, సంక్షేమం గురించి తెలుస్తుందని, ఇంట్లో కూర్చొని మైకుల ముందు మాట్లాడితే ఎలా అన్నారు. అందరికీ మంచి చేస్తున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

ఇంజేడులో కేంద్ర బలగాల కవాతు


ఇంజేడులో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామం ఇంజేడులో శుక్రవారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. వీరి వెంట ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫరీందర్, షరీఫ్ ఉన్నారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, చిన్న ఘటనలతో గొడవలకు పాల్పొడొద్దని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అలాంటి వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.


మాజీ మంత్రి శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాల్గవ వార్డు టీడీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీలో చేరిక

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 4వ వార్డుకు చెందిన హుసేన్‌రెడ్డి, ధనుంజయుడు, కాశీ, ఈశ్వర్‌గౌడ్, కిశోర్ బాబు టీడీపీని వీడి మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో శిల్పా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామని చెప్పారు.

కుందూ నదికి నీరు విడుదల

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని కుందూనదికి అధికారులు నీటిని విడుదల చేశారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటిని విడుదల చేశారు. మార్చి నెలలో సైతం నదిలో నీరు పుష్కలంగా చేరడంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కుందూనదిలో ప్రవహిస్తున్న నీరు

ఆకాశమంత ఆనందం


కూతురు దీప్తి (అంగన్‌వాడీ సూపర్‌వైజర్)ని సన్మానిస్తున్న తల్లి మార్తమ్మ (అంగన్‌వాడీ కార్యకర్త)

దొర్నిపాడు: కొన్ని ఘటనలు ప్రత్యేకంగా నిలిచిపోతాయి. అలాంటి సందర్భమే మహిళా దినోత్సవం రోజు చోటు చేసుకుంది. మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-2లో మార్తమ్మ కార్యకర్తగా విధులు నిర్వహిస్తుంది. ఆమె కూతురు గుర్రం దీప్తి ఏడాది క్రితం అదే డిపార్టు మెంట్‌లో ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా ఆళ్లగడ్డ ఐసీడీఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుంది. శుక్రవారం మండలంలో జరిగిన మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకొని వృత్తిరీత్యా కార్యకర్తగా ఉన్న తల్లి మార్తమ్మ..పై అధికారిగా విధులు నిర్వహిస్తున్న కూతురు దీప్తిని సన్మానించాల్సి వచ్చింది. దీంతో తోటి ఉద్యోగులు, కార్యకర్తలు చప్పట్లతో వారిని ఉత్సాహ పరిచారు. నా బిడ్డ.. నాపై అధికారిగా రావడం నాకు ఆకాశమంతా ఆనందంగా ఉందని తల్లి మార్తమ్మ ఆనందబాష్పాలతో పేర్కొంది.